ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక :

# ★ యుద్ధం! ★

రచన: ఆర్. జయలక్ష్మి

నాకు మొదట్నుంచీ మనస్తత్వ పరిశీలన అంటే ప్రాణం. డాస్టోవిస్కీనీ, ఫ్రెంచి సాహిత్యాన్నీ ప్రేమిస్తాను. ఫ్రాయిడ్ నా దేవుడు. అయితే ఈ వెర్రే నా పాలిటి దెయ్యం అయింది. భ్రమకి లోనుకావడం దెయ్యం పట్టినవాడి లక్షణం. విజయలక్ష్మి మనసు కనుక్కోవడంలో నేను పూర్తిగా భ్రమమీద ఆధారపడే పని చేశాను.

నేను విశాఖ పోస్టాఫీసులో కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులవి. మనిషిని యంత్రంగా మార్చే ఉద్యోగమన్నా, గోల, ఇరుకులతో ఊపిరాడనివ్వని పట్నవాసం అన్నా నాకు భయం సాగకవొచ్చేను. (వొచ్చిన తర్వాత దీన్నొక నూతన అనుభవంగా పరిశీలించాలని మనసుతో చెప్పుకున్నాను.)

ఉదయం డ్యూటీలు నాకు. పదకొండింటి కల్లా గది చేరుకుంటాను. నే నుంటున్న మేడంతా అన్నీ సంసారాలే. పైన రెండే గదులు. ఆ గదుల్ని ఆనుకుని అరగజం వెడల్పుని బాల్కనీ రెండోవైపు చాలంత డాబా వున్నాయి. పక్కగదిలోని క్రిస్టియన్ అమ్మాయిలు ఆ డాబామీద గోలెల్లో గులాబీ చామంతి మొక్కల్నీ దవనాల్నీ మరువాల్నీ పెంచుకుంటున్నారు. వొచ్చేరాగానే కేరియర్ మీద దాడి చేస్తాను. ఆ భోజనం నమిలి మింగేసి గోలెలదగ్గిరా, బాల్కనీలో పిట్టగోడ నానుకుని కొంతసేపు గడుపుతాను.

డాబాలమీద పక్క బట్టలు ఎండవేసుకుంటూనో, తలలు ఆరబెట్టుకుంటూనో, వార్తపత్రికలు చూచుకుంటూ కిటికీలదగ్గరో, వసారాల్లో పిల్లలికి పాలిస్తూనో కబుర్లు చెప్పుకుంటూనో ఆడవాళ్లు కనిపిస్తారు. ఎంత తీరిక జీవితం స్త్రీలది! అయినా పాపం, విస్తృతానుభవానికి అవకాశాలు లేవులే వాళ్ళకి.

కింద ఎదురుగా వున్న స్కూల్లో ప్రతీ మూడు పావు గంటకీ గంట కొడుతుంటారు. ఒక్కొక్క గంట కొడుతూంటే మళ్లా ఆఫీసుకి వెళ్ళవలసిన టైమవుతోందనే బెంగ.

సరిగా రెండింటికి మళ్ళీ ఆఫీసులో వుంటుంది నా దేహం. ఆఫీసుకి పుస్తెకట్టినట్టు అక్కడే రాత్రి పది కొట్టేదాకా బతికే సహోద్యోగుల్ని చూడగానే నాకు కంపరం ఎత్తుకొచ్చేది. ఏం మనుషులు వీళ్ళు. ప్రమోషన్లూ పోస్టులని మించిన పరమావధిలేదు. ద్వంద్వార్థాల మాటల్ని విసురుకోవడం నాలాంటి బ్రహ్మచార్లమీద వేళాకోళాలు ఆడడం కంటె గొప్ప శృంగారాన్ని ఎరగరు. మాటల్ని పైవాళ్లకి మొయ్యడం తప్ప ఇంకో హాబీ లేదు. కాని నా పరిస్థితులు అలాంటివి అని గ్రహించలేగాడు. (నాలో కలిగే అసూయ, కోపం మొదలయిన అవాంఛనీయ భావాలు తుదకి జాలిగా రూపొందుతాయి. అందుకే కాబోలు ఒకరు నామీద జాలిపడడం ఇష్టం వుండదు నాకు) ప్రభుత్వోద్యోగుల్లో మంచితనం సైతం ఒక బలహీనతగా మాత్రమే కనిపిస్తుందేమో,

హోటలు భోజనం, గది నిద్ర జీవితం సుఖంగా గడుస్తుంది. మగాడినయితే నా స్థితిలో చాలా తృప్తిగా తిరిగేవాడే. కాని నేను ఉచితమైన-సౌందర్యంలేని సౌకర్యాన్ని భరించలేను. శుభ్రంగా నౌకరీకి రాజీనామా ఇచ్చేసి కోనసీమ పోదామన్నంత కసి పుడుతోంది.

ఇంతలో చైనా దాడి ప్రారంభమయి విశాఖ జీవితంలోకూడా నవచైతన్యాన్ని నింపింది. రేవుని రక్షించడానికి ఎక్కడెక్కడినుంచో వొచ్చిన తెల్లదుస్తులలోని యువకులు, సైనికుల్ని తీసుకునేచోట పెరిగిపోతున్న క్యూలు, ఇవన్నీ నాలో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. ఎక్కడ చూచినా రేడియోలు వినడానికి గుంపులుగా చేరుతున్న జనాన్ని చూస్తేమట్టుకు కోపం వొచ్చేది. (భారతావనికి విపత్కాలం వొచ్చిందన్న స్పృహ వీళ్ళకి ఉన్నట్టు కనబడదు. మధ్యతరగతి నీరస జీవితంలోని విసుగుదలని కాస్త పోగొట్టుకునేందుకు పనికొచ్చేవి ఈ యుద్ధపు కబుర్లు)

వీటన్నిటితో బాటు చాలాకాలం తర్వాత వచ్చిన నూరి లేఖ కూడా నన్ను ఉద్రేకపరిచింది. 'మోహ వర్ణంతో కుస్తున్నాను గాని లేకపోతే మనసులోతుల్లో పుట్టిన ప్రశ్నని లరిగి పారేద్దును. నవ్వుతున్నావా? వొద్దు ఇటీవల అభివృద్ధిలోకి వస్తున్న మన దేశానికి వొచ్చిన ఆపదకి నా మనసెంత క్షోభిస్తున్నదో చెప్పుకోగలిగితేనా!......ఇంతకాలం వుత్తరం రాయనందుకు కోపమా! ఉత్తరాలూ, మాటలూ, చివరికి కలుసుకోవడాలుంటె కూడా మంచిస్నేహితులమన్న మానంలో మాధుర్యం నిండుతుందనుకుంటాను...'

వెంటనే విశాఖ రమ్మని నూరికి వ్రాశాను.

ఆర్మీపోస్టల్ సర్వీసుకి తీసుకుంటున్నారు. నేనూ పేరిచ్చాను. ఆరోగ్యపరీక్షలో సెలక్టు అయ్యాను కూడా, ఇంక ఆర్డర్సు రావడం తరువాయి

ఒక సాయంకాలం. అప్పుడే ఏ. పి. ఎస్. చేసిన ఒక గొప్ప పొరపాటుకి చీవాట్లు తిని వొచ్చి సీట్లో కూర్చున్నాను. ఓ ఇన్సూర్డు ఆర్టికల్ తీసికెళ్ళి అన్డెలివరీ ఆర్టికల్సులో పెట్టేశానుట. అది ఎంత ప్రమాదమో వివరించి చెప్పగా పుట్టిన చెమటలు ఇంకా ఆరడంలేదు.

ఒక్కసారి వరండాలోకి వొచ్చేను.

ఎదురుగా ఊహ సౌందర్యాన్ని తలపింప చేస్తూ, నవ్వుతూ

విజ్జీ

'హల్లో!' అని వెర్రిగా అరిచేసుకున్నాను. 'ఇక్కడికెప్పుడొచ్చేవు?' అన్నాను. ఆమె అత్తవారిది విజయవాడ అని తెలుసు. ఆమె పలకరించగానే నాకు లక్ష ప్రశ్నలు పుట్టుకొచ్చిందా? కడుపుతో-అబ్బే. చిన్నప్పుడు పిల్లగా ఉన్నప్పటి పిడికెడు నడుము ఇప్పుడూ

అలాగే ఎ మాత్రం బలవకుండా ఉంటే ?... మరి...?...ఛ! అదుగో బొట్టు!

ఆమె నవ్వి ఊరుకుంది.

గబగబ బేకరీ వైపు నడచి నా వెనుక విజ్జీని పరుగెట్టించాను. కేకు, బిస్కట్లు, కాఫీలు చెప్పి ఫేను వేసి ఆమెను కూర్చోమని ఎదురుగా నేను కూర్చున్నాను.

హైస్కూలులో నా సహాధ్యాయినీ విజయ లక్ష్మి. ఇప్పటికీ అదే సౌందర్యం – అప్పుడు వికసిస్తోంది. ఇప్పుడు పరిపూర్ణతని పొందింది. సన్నంగా పొడుగ్గా ఉంటుంది. ఆమె సన్నం అన్న భావనని రానీయని గుండ్రని నిండైన అవయవాలు. లోపల జ్యోతులున్నట్టు మెరిసే చెక్కిళ్ళు నక్షత్రాలు ఇల్లు కట్టుకున్నట్టుండే కళ్ళు.

'తినేస్తావా చూపుల్తో?' అంటూ నవ్వింది విజ్జీ.

ఆ ప్రశ్న పట్టించుకోనట్టు నేను టేబుల్ మీది పువ్వుల్ని తాకిచూస్తూ ఎంత అందంగా నేచురల్ ఫ్లవర్స్‌లా కనిపిస్తున్నాయి!' అన్నాను ఒక బిస్కెట్ మాత్రం తీసుకుని ప్లేటు ఆమె ముందుకు తోసి.

'అవును నేను పునిస్త్రీలా కనిపిస్తున్నట్టు' అంది విజ్జి గంభీరంగా కేక్‌ని తీసుకుంటూ.

నా చేతిలోని బిస్కెట్ జారిపడింది

'అయితే నీ భర్త—'

'పుస్తెకట్టినాయన అను. అవును పోయేరు.'

నోరు మూసుకున్నాను. మరోప్పుడైతే 'అనుభవం నీకు ఎదుటి మనిషిని కలవర పరచడం నేర్పినట్టుంది.' అనే వాణ్ణేమో కాని ఆ సమయంలో నోరు పెగల్లేదు.

ఆమె తింటూంటే చూస్తున్నాను.

'అప్పుడే నాతో విసుగొచ్చిందా?' అని నవ్వింది

అదుగో మళ్ళీ.

'స్నేహ సౌందర్యాలతో విసిగిపోయేటంత గవర్నమెంటు సర్వీసు చెయ్యలేదింకా.'

ఆమెకి అర్థంకాలేదు నామాట. స్పష్టమే.

"చిత్రంగా మాట్లాడతావే. ఇంకా కథలూ అవీ రాస్తున్నావా?"

చిన్నగా నవ్వి ఊరుకున్నాను నాకు తెలుసు విజ్జీకి ఉన్న సాహిత్యాభిరుచి ఎంతో, నా రచనల పట్ల ఆమెకేమాత్రం ఆసక్తి లేకపోయినా వాటికోసమే ఆమె నన్ను ఆరాధిస్తుంది. అదీ ఎరుగుదును.

(ఆరాధింపబడడం మరీ అంత చెడ్డ సంగతి కాదుగాని నీలాం ఏముందో అర్థం చేసుకోలేక ఏదో వుందిలే అని బుజ్జగింపు ధోరణిలో నిన్ను ఆరాధించేవాళ్ళని నువ్వు భరించలేవు.)

రోడ్డుమీద పడగానే "అసలు నేనిక్కడ ఉంటున్నట్టు నీకెలా తెలిసింది విజ్జీ." అనడిగేను

"ఎలా తెలుస్తుంది. నీకంటే మా వూను అక్కర్లేదుగాని..." అని ఏమో అనబోయి చూపుకి భయపడి ఆ ధోరణి తుంచేసుకుంది విజ్జీ.

"సూరి వొచ్చేడు అన్నయ్యదగ్గిర వైద్యం కోసం. సూరి పిలుమను రమ్మంటే నీకోసం ఇలా వొచ్చేను. ఇదిగో యడ్రసు ఓ మాటు వొచ్చి పో." అని నాకో కార్డు ముక్కఇచ్చి కదులుతున్న పదిమూడో నెంబరు బస్సులో ఎక్కేసింది.

నేను ముందు ఆనందముతో ఆశ్చర్య పోయేను సూరి నాకు అంత దగ్గర్లో వున్నందుకు.

విజ్జీ నా నిశ్శబ్దంవల్ల అవమానింపబడినట్టు భావించుకుని అలిగి వెళ్ళిపోయింది.

క్షేమ కాదు గద కొంపతీసి ...... ఉన్న మాట చెప్పేస్తున్నాను. విజ్జీని కలుసుకోవాలని పెద్ద అనిపించలేదు. స్నేహితులంటే ప్రాణమే నాకు కాని అభిరుచుల సామ్యం కూడా కోరుతాను. కలవడానికి.

అనుభవాన్ని విస్తరించుకుంటూ అన్వేషణని సాగిస్తున్నాను నేను, కాని విజ్జీ...స్త్రీ అని జనరలైజు చేయడం ఎందుకులెద్దు-అనుభవానికి హద్దులు గీసుకుని అన్వేషణకి గోరీకట్టి లేక అసలు అన్వేషణకి ఉయ్యాలే వెయ్యలేదా? జీవిస్తోంది.

కాని సూరిని చూడడం నా మానసిక కనీస అవసరం.

"సూరి!"

—అది నాకెంత ప్రియమైనపేరో ఎలా చెప్పను నేది? మాది చిన్ననాటి స్నేహం ఏం కాదు. కాని ఉదయించగానే సద్యో యౌవనం పొందింది. అందుకే మా స్నేహం అజరామరం.

ఆమధ్య విజయనగరం ఆర్టు స్కూలు చూడడానికి వెళ్ళాను, పైడిరాజుగారి తర్వాత అంతలా మాజిక్ చేస్తున్నట్టు స్కెచ్ వెయ్యగలిగిన సన్నటి పొడుగాటి యువకుడు నన్నాకర్షించాడు అతనూ నా కథలు చదివాడు.

అది మా తొలి పరిచయం.

మాకు ఆర్డర్సు రావటానికి అట్టే వ్యవధి లేదనుకుంటున్నారు. ఆఫీసులో, అందుకని ఆ ఆదివారమే బొబ్బిలికి బయలుదేరేను.

వెళ్ళడం చాలా మంచిదయింది ....

విజ్జీ ఇంట్లోలేదు. నర్సింగ్ హోంలో ఉందన్నాడు నౌకరు. ఆ పక్కనేట తీసుకెళ్ళాడు

ఒక కేబిన్‌లోంచి రోగిమూత్రం వున్న పాత్రని తీసుకొని బయటికి వస్తోంది విజ్జీ.

'లోపల కూర్చో.' అని నాకు చెప్పి తన పనిమీద వెళ్ళింది.

విజ్జీ నర్సుకాదు ఇతర నర్సులుండగా తానెందుకు చేస్తోంది ఈ పని?

దుష్పటీకింప ఏపాటి శరీరం మంచాని కంటుకుందో తెలీదుగాని, మొహం మట్టుకు నిండుగా, నల్లనిగడ్డం మధ్య మెరిసే కళ్ళూ చిన్నవ్వులతో , నడుమ రెండు చుక్కలూ చంద్రవంకా నవ్వుతున్న మబ్బు ముక్కలాకనిపిస్తోంది.

మొదట పోల్చుకోలేకపోయేను.

'వొచ్చావా రంగా ?' లేవబోయి మూలిగాడు.

రోగం ఎంత పిప్పిచేస్తేనేం శరీరాన్ని, స్నేహం శబ్దరూపం దాల్చినట్టున్న ఆ పిలుపునే పోల్చుకోలేనా ?

'సూరీ!' అప్రయత్నంగా నా పెదవులు వొణికి పలికాయి.

'ఏ విండి లాంత యార య్యావు' అంటూ నెమ్మదిగా కుర్చీలో చతికిలపడ్డాను.

(తరువాయి 21 వ పేజి)